క్లుప్తంగా

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సురేందర్

తలమడుగు: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్సై సురేందర్ అన్నారు. శనివారం మండలంలోని ఖోడద్ గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉంటుందన్నారు. వాహనదారులు పత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటిస్తూ పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ముడుగు శామ్యూల్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వీరయ్య, లక్ష్మణ్, గజానంద్, దేవురావు, మారుతి, శ్రీనివాస్, శ్రీనివాస్, శుద్ధోదన్, కిషోర్, రాజేందర్ పాల్గొన్నారు.

హీరాసుక్క జయంతి కమిటీ ఎన్నిక

ఇంద్రవెల్లి: ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కుల గురువు, గోండి ధర్మగురు హీరాసుక్క జయంతి జిల్లాస్థాయి ఉత్సవ కమిటీని శనివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఆర్క ఖమ్ము, ప్రధాన కార్యదర్శిగా పూసం ఆనంద్‌రావ్, మహిళ కమిటీ సభ్యులురాలుగా ఆత్రం అనుసూయ, కార్యదర్శులుగా ఉయిక సుదర్శన్, మెస్రం కేశవ్‌రావ్, సెడ్మకి సుభాష్, ఆడిట్ కార్యదర్శులుగా విశ్వనాథ్, సోయం రాందాస్, కురేంగే యాదవ్‌రావ్, వడ్డి ఉత్తం, మడావి శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా మెస్రం రవి, సలహాదారులుగా కుర్సేంగే తానాజీ, సిడాం భీంరావ్, మెస్రం నాగనాథ్, గేడం జ్ఞానేశ్వర్, మెస్రం సుభాష్‌లను ఎన్నుకున్నారు.

'యుద్ధం ఆపేందుకు ఒత్తిడి తేవాలి'

ఎదులాపురం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధాన్ని ఆపేలా అంతర్జాతీయంగా ఒత్తిడి తీసుకురావాలని స్టూడెంట్ ఇస్లామిక్ ప్రతినిధులు, ఎస్ఐవో ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం పోస్టర్ ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ యుద్ధంలో వేల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని వెంటనే యుద్ధాన్ని ఆపేలా అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచాలన్నారు. ఎస్ఐవో ప్రతినిధులు షఫీ అనాజ్, ఇమాద్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు పోలీసులు సహకారం అందించాలి

ఎదులాపురం: యువతకు పోలీసులు సహకారం అందించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి కోరారు. జిల్లా ఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. బేల మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాస్ శ్యామ్, మాజీ సర్పంచ్ రూప్‌రావు, అవినాష్, శంకర్, అవినాశ్, తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: మండలంలోని కుచలాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు పండరి, రమేశ్‌ల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం, పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కంది శ్రీనివాస్ రెడ్డి

ఆదిలాబాద్: జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలంను శనివారం ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ముడుపు దామోదర్ రెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, రామదాస్ నాక్లే ఉన్నారు.

ఆధ్యాత్మికంలో గిరి గ్రామాలు

- మద్యం, మాంసానికి దూరం
- ఏటా సప్తాహం కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామస్తులు



రాజంపేట్ సప్తాహం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

సిరికొండ: మారుమూల గిరిజన గ్రామాలు ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నాయి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారు. ముందు తరాల వారికి తెలిసేలా గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మద్యం, మాంసం ముట్టకుండా జీవనం సాగిస్తున్నారు. ఆ గిరి గ్రామాలపై కథనం..

గత 24 సంవత్సరాలుగా..

మండలంలోని రాంపూర్ గ్రామ ప్రజలు వ్యవసాయం చేస్తూ.. జీవనం సాగిస్తుంటారు. గత 24 సంవత్సరాలుగా ప్రతీ సంవత్సరం మాఘ మాసంలో ఏడు రోజుల పాటు అఖండ హరినామ సప్తాహం కార్యక్రమాలు నిర్వహిస్తారు. భగవతం, రామాయణం, ప్రవచనాలు నిర్వహిస్తారు. ఏడు రోజులు పాటు గ్రామంలో నిత్యన్నదానం చేస్తారు. సప్తాహం కార్యక్రమాల్లో గ్రామస్తులే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల వారు కూడా పాల్గొంటారు. కార్తీమాసంలో వేకువజామునే గ్రామంలోని ఆలయాల్లో కాగాడ హారతి భజనాలు నిర్వహిస్తారు.

మద్యం, మాంసం నిషేధం..

మండలంలోని రిమ్మ పరిధిలోని రాజంపేట్‌లో మద్యం, మాంసం నిషేధం. గ్రామస్తులు ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ.. ప్రతీ కుంటుంబం నుంచి కొంత నిధులు సేకరించి గ్రామంలో హనుమాన్ ఆలయాన్ని నిర్మించారు. గత ఏడు సంవత్సరాల నుంచి గ్రామంలో ఏడాదికోసారి అఖండ హరినామ సప్తాహం, భజన కీర్తనాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడుస్తూ.. మంచి అలవాట్లతో అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని రాయిగూడలో ప్రతి ఏడాది తిరుమల, తిరుపతి వారి కల్యాణం జరిపిస్తారు. ధర్మసాగర్, సిరికొండ, వాయిపేట్, సోన్‌పెల్లి, పోన్న గ్రామాల ప్రజలు ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తున్నారు.

సన్మార్గంలో నడవాలని..



గ్రామస్తులందరం సన్మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాం. ఆ ఉద్దేశంతోనే ప్రతీ ఏడాది సప్తాహం కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముందు తరాలకు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు మంచి, చెడులు నేర్పుతున్నాం. ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తున్నాం.

– గుణవంత్ రావు, గ్రామ పటేల్, రాజంపేట్

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



ఆధ్యాత్మికతను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలి. ప్రతి ఏడాది గ్రామంలో సప్తాహం కార్యక్రమాలు నిర్వహింస్తాం. భగవతం పారాయణ, ప్రవచనాలు బోధిస్తాం. ఆధ్యాత్మిక మార్గంలో నడిస్తే.. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

– చెండే సంభజీ, రాంపూర్ గ్రామస్తుడు

అయోధ్య అక్షింతల పంపిణీ



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె)లో శనివారం ఇంటింటా అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమలో గ్రామస్తులు రాంచెందర్‌రెడ్డి, చెన్నల మహేందర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

నేరడిగొండ: వైడూర్యపురం(వడూర్)లో శనివారం అయోధ్య రాముల వారి అంక్షితల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు డప్పువాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలు, కరపత్రాలు పంపిణీ చేశారు.

రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

ఆదిలాబాద్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో ఈనెల 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని పట్టణంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామికి శనివారం విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు శారద, రజిని, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారి నుంచి మండల కేంద్రానికి చెందిన ఐద రాజేశ్‌కు శనివారం ఆహ్వానం అందింది. రాజేశ్వర ఇచ్చోడ మండల కేంద్రంలోని రామలక్ష్మణ మందిరం వద్ద గత కొన్నేళ్ల నుంచి జై శ్రీరామ్ గోశాల నిర్వహిస్తున్నాడు, రామ మందిరం నిర్మాణం కోసం గతంలో ఇచ్చోడ నుంచి అయోధ్య వరకు పాదయాత్ర కూడా చేశారు.

ఆలయ కమిటీ ఎన్నిక

ఇంద్రవెల్లి: మండలంలోని దొడంద పరిధిలోని పవిత్రమైన జంగుస్ భూయారి ఆలయ కమిటీని సర్పంచ్ తుంరం నాగోరావ్, గ్రామ పటేల్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుంరం ప్రభ, ఉపాధ్యక్షుడిగా ఆత్రం గోవింద్‌రావ్, కార్యదర్శిగా మడావి జ్యోతిరామ్‌పటేల్, కోశాధికారి కొడప భీంరావ్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా సకరాం, ప్రచార కార్యదర్శిగా సుర్పం జుగ్గులను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుంరం డొంగర్‌రావ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన బొల్లారపు వామన్ కుటుంబసభ్యులకు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి శనివారం రూ. 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. బొల్లారపు కామన్ కుమార్తె శోభ అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో కుటుంబసభ్యులను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబాన్న, మేకల మల్లన్న, రమేశ్‌రెడ్డి, వెంకన్నయాదవ్, సాంబశివ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఏబీవీపీ నాయకులు ఆవునూరి శ్రీనివాస్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా.. బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ శనివారం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: సంక్రాంతి పండుగాను పురస్కరించుకొని శనివారం మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని అంద్‌గూడలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 91 యువతులు, విద్యార్థినులు హాజరై ముగ్గులు వేశారు. ముగ్గులను ఎంపీపీ పోటే శోభాబాయి, సర్పంచ్ కినక జుగాదిరావ్‌లు పరిశీలించారు. అనంతరం గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏకలవ్య ట్రస్ట్ సభ్యులు రాజుల వారు దిగంబర్, వాటర్ షెడ్ కమిటీ సభ్యులు సెడ్మే భీంరావ్, కినక పక్రు, ఏకల్యవ ఫౌండేషన్ సిబ్బంది ముత్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో ధనలక్ష్మి, శ్రీలత, నందినీలు బహుమతులు అందుకున్నారు. సబ్ జూనియర్ విభాగం నుంచి చైత్ర, శృతి, పూజ బహుమతులు అందుకోగా.. జూనియర్ విభాగంలో సాత్విక, శ్రీని ధి, రమ్యలు గెలుపొందారు. కార్యక్రమంలో రాజగోపాల్, తిరుపతి రెడ్డి, రాజన్న, సంతోశ్, శ్రీనివాస్, అంజన్న, రమేశ్, శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న జంటలు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 17వ వార్షికోత్సవంలో భాగంగా ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు ఆలయ వ్యవస్థాపకుడు శ్రీ శివదత్తగిరి మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, నవగ్రహ పూజ, అర్చన, హోమం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు అనిల్, గ్రామపెద్ద గంగాధర్ రెడ్డి, సుగుణాకర్, మనీష్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బోథ్: మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రాన్ని పూలాజీ బాబా కుమారుడైన కేశవ్ ఇంగ్లే దాదా శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలాజీ బాబా చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని కోరారు. సర్పంచ్ పందరం సుగుణ శంకర్, లక్ష్మణ్, ఆడం పుల్లన్న, శంకర్, శ్రీధర్ రెడ్డి, జుగాది రావు, విజయ్, లింగు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే మెరుగైన ప్రదర్శన

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: నిరంతర సాధనతోనే మెరుగైన ప్రదర్శన కనబర్చవచ్చని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకట రమణ, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, ఎంపీటీసీ పండరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సద్దాం, సురేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మండల కేంద్రానికి చెందిన ఏలేటి అశ్విన్ రెడ్డి నానమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బోథ్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని పొచ్చర గ్రామంలో మద్దెల అనిల్ కుమార్ స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో యువకుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందన్నారు. గెలుపు ఓటములు సహజమని అన్నారు. ఓటమి రేపటి విజయానికి నాంది కావాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజంలో బ్రాహ్మణుల స్థానం కీలకం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: సమాజంలో బ్రాహ్మణుల స్థానం ఎంతో కీలకమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక తిర్పెల్లి రామాలయంలో బ్రాహ్మణ మిత్ర మండలి, బ్రాహ్మణ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంఖ్యాపరంగా బ్రాహ్మణులు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ సమాజంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. ఎవరికీ హాని తలపెట్టని గొప్ప సంస్కారం బ్రాహ్మణులకే సొంతమన్నారు. బ్రాహ్మణ సమాజ్ అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బ్రాహ్మణమిత్ర మండలి బ్రాహ్మణ సమాజ్ అధ్యక్షుడు విశ్వాస్, సంతోష్, అర్చక పురోహిత బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పుప్పాల సంతోష్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు రాధాకృష్ణ శాస్త్రి పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ హమాలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్ మేనేజర్ క్రీట్ విరోధినకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్క దేవిదాస్, సీడబ్ల్యూసీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వసంత్, నాయకులు హుస్సేన్ చౌహాన్, అన్నపూర్ణే సంబాజీ, అబ్దుల్ ఖాన్, గోపాల్, హమాలీలు పాల్గొన్నారు.

పరామర్శ

జైనథ్: మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పలు కుటుంబాలను శనివారం పరామర్శించారు. మున్నూర్ కాపు సంఘం తాలుకా మాజీ అధ్యక్షుడు సుగ్గెం విఠల్ అల్లుడు కంది జైపాల్ మరణించడంతో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. పెండల్‌వాడ గ్రామానికి వెళ్లిన ఆయన, జైపాల్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అతని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జైనథ్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భానుచందర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, అడప తిరుపతి, మద్దుల ఊషన్న, తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: రామాయి గ్రామానికి చెందిన యమునా బాయి, లోకారి గ్రామానికి చెందిన మడావి సోములు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న శనివారం వారి వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ గండ్రత్ రమేశ్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జైనథ్: మండలంలోని పెండల్‌వాడ గ్రామానికి చెందిన సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి సుగ్గెం విఠల్ అల్లుడు కంది జైపాల్ కుటుంబసభ్యులను సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కుంటాల రాములు, అర్ధాంగి రమేశ్, గెడం పొచిరాం, బుర్రి సట్వాజీ ఉన్నారు.

శ్రమదానం చేసి.. రోడ్డు నిర్మించి



శ్రమదానం చేసి రోడ్డును బాగు చేసుకుంటున్న గ్రామస్తులు

- దారి నిర్మించుకున్న మామిడిగూడ గ్రామస్తులు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు

ఇంద్రవెల్లి: మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ పరిధిలోని మామిడిగూడ గ్రామానికి రోడ్డు, వాగు వద్ద కల్వర్టు నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. ఇప్పటి వరకు పనులు ప్రారంభించక గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చేతికి వచ్చిన పంటలు అమ్ముకునేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదని వాపోతున్నారు. దీంతో గ్రామస్తులందరూ శ్రమదానం చేసి, రోడ్డుకు మరమ్మతులు చేసి దారి ఏర్పాటు చేసుకున్నారు.

వంతెన లేక అవస్థలు..

మామిడిగూడ గ్రామానికి రోడ్డు, వంతెన లేకపోవడంతో వర్షకాలంలో రాకపోకలు స్తంభిస్తాయి. గర్భిణులు ప్రసూతి కోసం, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని నెల రోజుల ముందే ఆస్పత్రిలో చేర్పించడం, లేదా ముందస్తుగా బంధువుల ఇళ్లకు తరలిస్తారు. విద్య, వైద్యం అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

రూ. 4 కోట్ల 20 లక్షలు మంజూరు..

గ్రామంలో సుమారు 42 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మామిడిగూడ(ఏ) నుంచి మామిడిగూడ(జి) గ్రామం వరకు రెండు కిలోమీటర్ దూరంలో ఉన్న రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 70 లక్షలు, వాగుపై వంతెన నిర్మాణానికి రూ. 3 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై సంవత్సరం అవుతున్నా.. నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు, వంతెన పనులు ప్రారంభించాలని కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల చుట్టూ తిరిగినా.. ఎలాంటి ఫలితం లేకపోకపోవడంతో శ్రమదానం చేసి రోడ్డు నిర్మించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు, వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



రోడ్డ, వంతెన లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం పండించిన పత్తి అమ్మేందుకు వాహనాలు రాక నష్టపోతున్నాం. అధికారులు వెంటనే రోడ్డు, వంతెన పనులు ప్రారంభించాలి.

– సెడ్మాకి భీంరావ్, మామిడిగూడ

సమస్య పరిష్కరించాలి



ప్రతీ సంవత్సరం రోడ్డుకు మరమ్మతులు చేసుకొని కాలం గడుపుతున్నాం. వానాకాలంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది అవుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి.

– వెట్టి సోము, మామిడిగూడ

ఇంటింటా సంక్రాంతి సందడి

ఎదులాపురం: సంక్రాంతి అంటేనే నోరూరించే పండి వంటలు, రంగురంగుల ముగ్గులు గుర్తుకు వస్తాయి. చకినాలు, కారం పూస, గారెలు, సంక్రాంతికి ప్రత్యేకంగా చేసే నువ్వులు, కొబ్బరి, వేరుశనగ బూరెలను ఇష్టపడని వారుండరు. సంక్రాంతి మరో రెండు రోజులు ఉండగా.. పిండి వంటలతో ప్రతీ ఇల్లు సందడిగా కనిపిస్తోంది.



ద్వారకానగర్‌లో చకినాలు చేస్తున్న మహిళలు



పిండిగిర్ని వద్ద ప్రజల బారులు